

# జీవితాదర్శం

## పాలడుగు వెంకటేశ్వరరావు

మొగాడన్న తర్వాత దర్జాగా బ్రతకటం నేర్చుకోవాలి మంచిగాని, చెడుగాని. అయితే ఆర్థిక స్వాతంత్ర్యం లోపించాక ఏ మనిషయినా నిలువునా దిగజారి పోతాడు. విలువలు మంటగల్సిపోతయ్. చుట్టూవున్న వాతావరణం ముళ్ళపొదలా అల్లుకుపోతుంది. కనపడని బంధనాలు ఊపిరాడకుండ చేస్తయ్. అలుసుచేసి మూలను కూర్చోపెడ్తయి. ముళ్ళపొదని ఛేదించుకుని బయటికి రావటానికి మనిషి ఎంతగానో ప్రయత్నిస్తాడు. గిలగిల లాడ్తాడు. గింజుకుంటాడు. బంధాలు మరింత బిగుసుకుని మనిషిని నిలువునా నిర్వీర్యుడ్ని చేస్తాయి.

వరండాలో పడుక్కుర్చీలో కూర్చుని తాపీగా చుట్ట చుట్టుకుంటున్నాడు సూరిబాబు. పడగ్గదిలోంచి ఘర్షణ సూరిబాబు చెవుల్దాకా వినవస్తోంది. నిమ్మకి నీరెత్తినట్టు తాపీగా కూర్చుని తన పనిలో మునిగిపోయాడు సూరిబాబు

వంటగదిలోంచి ఇంటావిడ వచ్చింది. తను ఆదుర్దాపడిపోతున్నది.

"ఇదుగో మిమ్మల్నే. వినపడటం లేదా? అట్లా ఎట్లా కూర్చోగల్గుతున్నారు. ఏం మనుషులు మీరు " అంది.

"ఏమిటే? విషయం ఏమిటి?"

"అల్లుడు మరల అమ్మాయితో ఘర్షణ పడ్తున్నాడు. ప్రొద్దుట్నించీ

సాగుతూవుంది ఈ మేళం. వెళ్ళి అతనికి సర్దిచెప్పకూడదూ? హెచ్చరించలేరూ?"

"ఉత్త ఘర్షణేగా? మరేం ఫర్వా లేదులే. వాదన వలన ఒకొర్నొకరు మరింత బాగా అర్థంచేసుకోవటానికి వీలవు తుంది. జీవితాంతం తోడుగా కల్సివుండ వల్సినవాళ్ళు. ఆ మాత్రమయినా వాళ్లకి ఒకర్నొకరు అర్థంచేసుకొనే అవకాశం ఇవ్వాలి ఒతర్ల స్వేచ్ఛాస్వాతంత్ర్యా లలో కలుగచేసుకోవటం తగ్గించాలి, మనం."

"మీ మాటలు నాకు అర్థంకావు. అన్నీ డొంకతిరుగుడు సమాధానాలు. ఇంత కాలంగా సంసారంచేసి మిమ్మల్నే నేను అర్థంచేసుకోలేకుండా వున్నాను" అంది భార్య.

"సర్లే. ఆ విషయం నేను చూసు కుంటాగా? నాకు వదిలిపెట్టి నువ్వు నిశ్చింతగా వుండు." సూరిబాబు ఆ భరోసా ఇచ్చాక ఆవిడ తృప్తిగా చూసి లోపలికెళ్ళింది.

ఘర్షణ సద్దుమణగింది.

గదిలోంచి దూకుడుగా సుబ్బరావు బయటికొచ్చాడు. మొహం కందగడ్డవలె వుంది. గిరిజాలజుట్టు రేగివుంది. పైజామా లాల్చీలలో సన్నటి శరీరం అస్తిపంజరంలో వూగులాడ్తుంది. సూరి బాబుని చూసి అప్రతిభుడయాడు సుబ్బా రావు. మరుక్షణం నిలవరించుకుని ముక్కు ఎగబీలుస్తూ బయటికెళ్ళి పోయాడు.

విషయం ఏమయినా కానీ, ఏక్షణంలో అయితే మగాడన్నవాడు కట్టుకున్న ఆడ దాన్తో వాదనకి దిగుతాడో అప్పుడే అతను తన స్థానం నుంచి ఓ మెట్టు దిగి ఓటమి నంగీకరిస్తున్నాడని అర్థం. జీవి తంలో ఎత్తుపల్లాలు చూసి, వ్యక్తిత్వాన్ని నిల్పుకోవటానికి భయంకరంగా పోరాటం సల్పి, ఈ రోజు సముచితస్థానం సంపాదించుకున్న సూరిబాబు తన కోణం లోంచి ఆ తుపానుల్ని గమనించి లాభ నష్టాల బేరీజు వేసాడు. సుబ్బారావు ప్రయత్నాలని సూచనప్రాయంగా గ్రహించి దూరాన్నుంచే గమనిస్తుండి పోయాడు సూరిబాబు. సూరిబాబు తన జీవితానుభవాన్ని అల్లుడికి అన్వయించా లని ప్రయత్నించాడు.

తిండి, బట్ట లేనివాడు వాటికోసం ప్రయత్నాలలో జీవితాన్ని వెచ్చిస్తాడు. అవి సమకూరిన మనిషి కొత్త విషయాల వెంట పరుగులు తియ్యాలని చూస్తాడు. లౌకిక విషయాలు సంతృప్తి కలిగిన వాడు అలౌకికం వయిపు అర్రులు చాస్తాడు. మనిషికో రకం పిచ్చి. ఎవడి పిచ్చి వాడికానందం

సూరిబాబుకి సుబ్బారావు మీద కొంత జాలి వుంది. మరింత సానుభూతీ లేక పోలేదు. అది అంతర్గతం. సమస్యల్ని ఎవరూ కోరితెచ్చుకోవా లనుకోరు.

అందుకే సుబ్బారావుని అంతదూరాన్నే వుంచాడు సూరిబాబు. దానికి తోడు కూతురి బాగోగులు. ఇంటావిడ పోరు. సుబ్బారావుమీద తన ఆధిక్యత నిల్పుకోవాలన్న కోరిక. అందుకే మొదట్నుంచి ఆ బెట్టు. బెట్టు సరిగా వుంటం వల్లనే సుబ్బారావు అంత సులభంగా తనని సమీపించలేడు. దూరాన్నుండే పట్టీలు కొడతాడు. సూరిబాబు ఆతని నిస్స హాయస్థితికి నవ్వుకోగల్గుతాడు.

మొగాడి జీవితంతో పద్దెనిమిదో ఏట నుంచి పాతికేళ్ళవరకూగల కాలమానం ముఖ్యమయినట్టిది. ఆ సమయం మనిషిని తీవ్రమయిన అలజడికి గురిచేసి జీవిత నౌకకు ఒడిదుడుకులను తెచ్చిపెట్టుంది. ఏ రకంగానయినా ఆ పరిస్థితి అధిగ మించగలిగితే అప్పట్నుంచి మనిషి జీవి తానికి స్థిరత్వం ఏర్పడుతుంది.

తన కాలంలో ఆ వయస్సులో సూరి బాబు అనేకమయిన పోకిళ్ళు పోవటం జరిగింది.

సూరిబాబు అత్తమామలకి అతని భార్య ఒక్కతే కూతురు. అయితే ఆ రోజుల్లో సూరిబాబు దృష్టి సంసారం పయినగాక ఇతర విషయాలపైన లగ్న మయింది. కాని మనిషిలోని కళాత్మక మయిన హృదయాన్ని గుర్తించి దానికి చేయూతనివ్వగల సహృదయత ఎంత మంది అత్తమామలకి, భార్యలకి వుంటుంది? దృక్పథాలు వేరయినప్పుడు, రాజీపరిస్థితి కనుచూపుదూరంలో లేనప్పుడు ఘర్షణ అనివార్యం అవుతుంది. అయితే సుబ్బారావువలెగాక సూరిబాబు మొండివాడు.

చిన్నప్పుడు తోలుబొమ్మలాటల్నీ, పెట్రోమాక్సు లయిట్ల వెల్తురులో రంగు రంగుల దుస్తుల్లో వేషాలు వేసుకుని, హార్మణీమోతల్లో రాగాలు తీస్తున్న నట కుల్నీ చూసినప్పుడు సూరిబాబు మనస్సు ఆ వయిపుకి ఆకర్షించబడింది. ఆ తళ తళలు, చమక్కులు చూసి చూసి వయస్సుతో పాటు సూరిబాబు కోరికలూ మరింత పెరిగి బలపడ్డాయి. అందుకే నాటకాలవాళ్ళ వెంట తిరగటం మొదలు పెట్టాడు. స్టేజి పక్కన కూర్చుని తెరలులాగేపని హృదయపూర్వకంగా చేసేవాడు. వీలయినప్పుడు నాటకాలూ వేసేవాడు.

అయితే మనిషి అన్నాక సంఘంలో బ్రతుకుతున్నాక, అతను పట్టించుకోకపోయినా సమాజం మనిషిని గూర్చి పట్టించుకుంటుంది. ఇవేమీ వద్దని పిచ్చి వేషాలు వెయ్యటం గాలిలో సర్కసు చెయ్యటంవంటిదే. అయినా ఒక సిద్ధాంతాన్ని నమ్మి, కళారాధనే ధ్యేయంగా పెట్టుకున్న మనిషి వీట్నిలెక్కచెయ్యడు. ఆ ప్రయత్నం వెనకాల ఘర్షణలూ, ఏడుపులూ, మొత్తుకోళ్ళూ వున్నా వాట్ని పట్టించుకోడు ..మొండివాడు రాజుకంటె బలవంతుడన్నారు.

కాని ఈ కళల మెరమెరల వెనక కూడా కొన్ని జీవితాలూ, వ్యామోహాలూ బలహీనతలూ, ఏడుపులూ, కన్నీళ్ళూ, ఆశానిరాశలూ వుంటాయి. సన్నిహిత మయిన పరిచయాలూ, కదలికలూ కొన్ని ఆకర్షణలని సృష్టిస్తాయి. ఉప్పూ, పులుసు తింటున్న ప్రతి మనిషీ ఆ ఆకర్షణలకి లొంగి, కోరికలు పెంచుకుని, వాట్ని తీర్చుకోటానికి ప్రయత్నించటం తప్పదు. కొండల వెనక గల సూర్యుణ్ని దూరం నించి చూసి ఆనందించటం సులభమేగాని కాంతికి కారణమయిన 'వాణ్ని' పట్టు కోవటంలో అధిగమించవలసిన మిట్ట పల్లాలు, కష్టనష్టాలు వుంటాయి.

ప్రతివాడికీ వేపకాయంతయినా వెర్రి వుంటుంది. ఎవడి వెర్రి వాడి కానందం. బాధ్యతల్ని దులపరించుకుని, కోరికల్ని పెంచుకోవటం ప్రతివాడూ చెయ్యగల అతి సులభమయిన పని!

అందువల్లనే, యవ్వనపు పొంగు మిసమిసలాడ్తున్న ఆ వయస్సులో సూరి బాబు, భార్య కన్నీళ్ళనీ, అత్తమామల ఆవేదనల్నీ, తలిదండ్రుల చీవాట్లనీ లెక్కచెయ్యక డ్రామాలవెంట తిరిగాడు. నాటకాలు ఆడాడు. అలౌకికమయిన ఆనందాన్ని జుర్రుకున్నాడు. ఆ సందర్భంలోనే అతనికి రాజయ్య ట్రూపుతో పరిచయం కలిగింది. చింతామణి నాటకంలో రత్నాన్ని చూసేక ఆ పరిచయం మరింత పెంచుకున్నాడు. రత్నం రాజయ్యకి రెండో భార్య. మంచి పొంగు మీద వుండేది అప్పుడు. బుగ్గలు జారి, జుట్టు తెల్లబడిన రాజయ్యని చూసిన కళ్ళతో సూరిబాబుని చూడలేకపోయింది రత్నం. మనసు కలవాలేగాని శరీరాలు పెనవేసుకుపోవటం అంత కష్టంగాదు. ఫలితంగానే సూరిబాబు రహస్యప్రణయం సాగింది. పోతే రహస్యం ఎన్నాళ్లో దాగదు. అటువంటి విషయాల్లో ప్రతి వాడూ ప్రక్కవాణ్ని వెయ్యికళ్ళతో కనిపెట్టూనే వుంటాడు.

గుట్టు రట్టయి అల్లరయింది.

అప్పటికే రత్నంకి నాలుగు నెల్ల కడుపు. అల్లరయి నాటకాల వాళ్ళతో తెగతెంపు లయ్యాక, అవమానంతో మొహం దించుకుని చివరికి అత్తవారి పంచను చేరాడు సూరిబాబు. సంగతంతా తెల్సినా కడుపులో పెట్టుకుని మామగారు అల్లుణ్ని ఆదరించక తప్పలేదు. ఆ అవమానంతో ఎదురుదెబ్బ తగిలిన సూరి బాబు వేషాలు తగ్గించి ఇంటిపట్టున వుండటం సాగించాడు. ఆ సమయానికి అతని వయస్సు ఆ పరిధిని అధిగమించింది.

విలువలు మంట గల్సినా, కట్టుకున్న భార్య చిన్నచూపు చూసినా, అయిన వాళ్ళు తేలిగ్గా తీసేసినా తప్పదు. తప్పు జరిగాక తలవంచక తప్పేదిలేదు. అవసరం మనిషికి ఆ పరిస్థితి తెచ్చిపెట్టుంది.

ఆ మచ్చమాసి సూరిబాబు తిరిగి తలె త్తుకు తిరగటం అప్పట్లో సాధ్యపడలేదు.

ఆ తర్వాత కూతురు పుట్టుకొచ్చి, ముసలాళ్ళు పోయాక, పెత్తనం చేతి కొచ్చాకగాని సూరిబాబుకి ఆత్మస్థైర్యం అలవడలేదు. అక్కడికీ నోరుగల వాడు గనక పెత్తనం చేజిక్కించుకుని ఆ ధైర్యంతో నిలదొక్కుకోగలిగాడు సూరిబాబు. అప్పటికి వయస్సుపొంగు అణగారి అతని దృక్పథం మారింది. సూరిబాబు తనూ ఇంకొకడికి నీతులు చెప్పగలవాడయాడు చరిత్ర తిరగేస్తే ఎవరిదయినా బండారం బయటపడ్తుంది తన నలుపు దాచిపెట్టుకోగలిగిన గురి వింద గింజ ఎదటివాడికి ఎన్ని నీతు లయినా చెప్పగలుగుతుంది. లోపాల్ని కప్పుకు రాగలిగిన నేర్పు వుండాలిగాని పత్తివిత్తులా చెలామణి అవటం పెద్ద మనుషులకి అంత కష్టసాధ్యమయిన పని గాదు.

అందుకే సుబ్బారావుమీద లోలోపలే అమితంగా జాలిపడ్తాడు సూరిబాబు. కూతురి కన్నెచెర వదిలించాలన్న తాప త్రయం వయసొచ్చిన ఆడకూతుళ్ళున్న ప్రతి తల్లిదండ్రులకీ వుంటుంది. ఆ ఆదు ర్దాలో కొన్ని కొన్ని విషయాలకి సరి పెట్టుకోవాల్సిన అవసరమూ కలుగుతుంది అప్పుడు.

సుబ్బారావూ మంచి కుర్రవాడే. ఆర్థిక పరిపుష్టిలేని పాతజీవితం నుంచి బయటపడటానికీ, ఇల్లరికం రావటానికీ అతనూ తొందరచూపాడు. ముఖాముఖీ ఎదురయాక గాని ఎవరి లొసుగులయినా స్పష్టంగా అవుపించవు. సుబ్బారావు ఇంటల్లుడుగా వచ్చాకగాని అతనికి వేప కాయకంటె కొంచం ఎక్కువయిన వెర్రే వున్నట్లు తెలిసింది సూరిబాబుకి.

జీవితం గూర్చి సీరియస్‌గా ఆలో చించక యువకులు పెడదార్లు తొక్కు తున్నారని సూరిబాబు అభిప్రాయం. పరవళ్ళు తొక్కుతూ, ఎగిసిపడ్తున్న ఆ యవ్వనపు పొంగుకి అడ్డుకట్టలు వెయ్యక పోతే కుర్రాళ్ళు చెడిపోవటం ఖాయమని సూరిబాబు నిర్ణయించుకున్నాడు. సూరి బాబుకి ముఖ్యంగా అవుపించింది కూతురి జీవితసమస్య. ఏపనీ చెయ్యకపోతేమానె, శుభ్రంగా తిని ఇంటిపట్టున వుండి, దర్జాగా సంసారం సాగించవచ్చుగదా సుబ్బా రావు! పెడదార్లు తొక్కుతున్న సుబ్బా రావు గురించి అది అతనికి కూతు ర్నిచ్చిన సూరిబాబుకనీసపుకోరిక. వాస్త వానికి సుబ్బారావు ఆ రకంగానే వుండి వుంటే, అతణ్ని సోమరిపోతనీ, బాధ్య తలు లేకుండా తినివుంటున్నాడనీ ఆరో పణలు రావా! అని అంటే అది వేరే సంగతి. ఏ ఆరోపణయినా సందర్భాన్ని బట్టి తలఎత్తుతూ వుంటుంది. ప్రస్తుత పరిస్థితిలో సుబ్బారావులో వాళ్ళకి కన పడిన లోటు అది. సుబ్బారావు పేకాడ తాడనీ, పనివున్నా లేకున్నా బస్తీకివెళ్ళి

లెక్కలేకుండా ర్చులు చేసి ఖడబ్బు నాశనం చేస్తాడనీ ఆరోపణ వచ్చింది, మొదటి రోజుల్లో.

భార్యతో సర్దాగా బస్తీకి వెళ్ళి సినిమా చూడటమూ, స్నేహితులు జతగలిసినప్పుడు కులాసాగా ఎప్పుడయినా డబ్బు పెట్టే అయినా పేకాడటమూ నేరాలని అనుకోలేదు సుబ్బారావు అప్పుడు.

ఎదటి వాడిలోని లోపాల్ని వేలెత్తి చూపి, ఎండేసిన సందర్భంలో ప్రతి వాడికీ ఒక విధమయిన సంతృప్తి కలిగే అవకాశం వుంది. పైగా దిక్కూ మొక్కూ లేనట్టు, తమ పంచను చేరి పనిపాట్లు లేకుండా తిరుగుతున్న మనిషిని అత్త వారు కూడా చిన్నచూపు చూస్తారు.

అసలు అన్నిటికీ మూలకారణం తన కాళ్ళమీద తను నిలబడి స్వతంత్రంగా జీవించలేని మనిషి అసహాయత. ఎదటి వాడి చేతకానితనంమీద నాలుగు రాళ్ళు విసరివెయ్యాలని ప్రతివాడూ ఉత్సుకత చూపిస్తాడు. మనిషి మనసులోని దౌర్బల్యానికి సంతృప్తిని కలిగించే సాధానాల్లో అది ఒకటి

మనిషి అన్నవాడు అటువంటి పరిస్థితిలో చిక్కుకోవాలగాని, అతనికి ఎన్ని సుగుణాలున్నా అవన్నీ మరుగున పడి లోపాలు మాత్రమే కొట్టవచ్చినట్లు కల్పిస్తాయి.

సుబ్బారావుకి నాటకాల పిచ్చి మొదట్నుంచీ వుంది. అత్తవారింటికి వలస వచ్చాకకూడా ఊళ్ళోవున్న కుర్రాళ్ళని పోగేసి, స్కూలుదగ్గర నాటకాలు ఆడేవాడు సుబ్బారావు.

సుబ్బారావుకి పర్సనాలిటీ వుంది. సమర్థత వుంది. ఉత్సాహమూ వుంది. మరోసందర్భంలో అయితే అతనికి ఎంత ప్రోత్సాహం లభించేదో గాని, ప్రస్తుతం మాత్రం సుబ్బారావుకి ఎదురయింది నిరుత్సాహమే. కనీసం రంగులకయినా డబ్బు కావాలిగదా! అది లేనప్పుడు ఎంత వుత్సాహం వుండి వుపయోగం ఏమిటి? టికెట్టు లేకుండా వచ్చి చూసి తోచిన విమర్శలు చేసిపోవటమయితే తెల్సుగాని, ధన సహాయం చెయ్యమంటే మొహాలు చాటుచేసుకుని పోయే తత్త్వం గదా మన వాళ్ళది!

పైగా సుబ్బారావు వూళ్ళోవున్న కుర్రవాళ్ళని కూడా చెడగొట్టున్నాడని అపవాదు వచ్చింది. అందుకే తన కార్యస్థానం బస్తీకి మార్చేడు సుబ్బారావు. అయితే ధనాభావం అతన్ని ఇరకాటంలో పెట్టింది; అతని ప్రయత్నాలకి అడుగులోనే హంసపాదు తెచ్చిపెట్టింది. అయినా అతని పిచ్చి అతనికే ఆనందం అవసరం నెత్తిమీదకి వచ్చి కూర్చోగా, అమాయకంగా ఆ సంగతి సూరిబాబుకి చెప్తే, కళ్ళెర్రచేసి చూసి మారుమాట లేకుండా వెళ్ళిపోయాడు. అత్తగారితో ప్రస్తావిస్తే ఎన్నో చదువులు చదివింది!

భార్య ఏమన్నా మెదలకుండా వుంటూంది ఇదివరకయితే అప్పుడప్పుడు భార్యద్వారా సుబ్బారావుకి డబ్బు ముడ్తూ వుండేది. ఆ సంఘటన తర్వాత ఆ మార్గాలూ బందయిపోయాయి. ఉన్న కొద్దీ సుబ్బారావు పరిస్థితి హీనంగా తయారయింది. అదేమీ గమనించకండానే, అటువంటి పరిస్థితిలోనే, సుబ్బారావు భార్యతో వాదానికి దిగి, ఘర్షణ పడ్డాడు. ఏ మొగాడయినా అంతవరకూ వస్తే అతని వలన ఏ ఉపద్రవమూ జరగదన్న ధీమాతో సూరిబాబు సుబ్బారావుకి ఎదురయిన ఈ జీవిత నాటకానికి కేవలం 'ప్రేక్షకుడుగానే' వుంటానికి నిర్ణయించుకున్నాడు. పిల్లికి చెలగాటం, ఎలక్కి ప్రాణసంకటం. సుబ్బారావూ, కాలగతిలో ఇటువంటి ఒడుదుడుకులకి లోనయినా, ఎదురుదెబ్బలు తగిలేక, ఆ ఉధృతం తగ్గాక, ఆపొంగు చల్లారాక తనవలెనే బుద్ధిమంతుడవుతాడన్న విశ్వాసం సూరిబాబుకి వుంది. అందుకే చిదానందుడి వలె అంతా వింటూ, చూస్తూ కూడా నిమ్మకు నీరెత్తినట్టు, ఆ రోజుల్లో తనూ ఆడిన లీలల గురించిన స్మృతుల్ని నెమరేసుకుంటంలో మునిగిపోయాడు సూరిబాబు.

చుట్ట చుట్టటం పూర్తిచేసి అగ్గిపెట్టె కోసం పిల్చాడు సూరిబాబు.

"అమ్మాయ్ ! ఏం చేస్తున్నావ్ ? అగ్గిపెట్టె తెచ్చిపెట్టు," అని.

కూతురు అగ్గిపెట్టె తెచ్చిఇచ్చింది. తీరిగ్గా చుట్ట వెలిగించి గుప్పుగుప్పున పొగ పీల్చి కూతుర్ని అపేక్షగా చూస్తూ అడిగాడు సూరిబాబు.

"ఏమిటి ? ఏదో గొడవ పడ్తున్నట్లుంది ? సుబ్బారావు ఏమంటున్నాడు ?"

"ఏం లేదు నాన్నా. డబ్బు కావాలట."

"డబ్బా ? ఎందుకు ? ముందు సంపాదించటం నేర్చుకుని, ఆ తర్వాత ఖర్చుపెట్టమని చెప్పలేకపోయావ్ ! అయినా ఏం అవసరం వచ్చిపడిందట ఇప్పటికిప్పుడు ?"

"ఎవరో తెలిసిన వాళ్ళు కనపడ్డారట. వాళ్ళు ఇప్పుడు బస్తీలో వున్నారట. వాళ్ళని తీసుకొచ్చి మన వూళ్ళో నాటకం వేయిస్తారట. అందుకని..."

"ఆఁ. అందుకని డబ్బు కావాలంటున్నాడు. అవునూ, ఇక్కడ రూపాయల చెట్టుందనీ, కావల్సినప్పుడు కోసుకోవచ్చనీ సుబ్బారావు ఉద్దేశ్యం లాగుందే.. !" పకపకమని నవ్వాడు, సూరిబాబు.

ఒక మనిషిని, కట్టుకున్న భార్య ఎదటే, మామలు ఇటువంటి మాటలు అనటం, పురుగుని తీసినట్టు తీసెయ్యటం, అవన్నీ వింటూ కూడా ఏం పట్టనట్టు భార్యలు వూరుకోవడం ఈ దేశపు అల్లుళ్ళ దౌర్భాగ్యం. భారత నారి మేల్కోవాలి. తండ్రులు ఔచిత్యాన్ని పాటించకుండా తమ భర్తల్ని

తూలనాడటమనే దుర్మార్గపు ప్రక్రియని, ముఖ్యంగా భర్తల్ని ఇల్లరికం తెచ్చుకున్న ఇల్లాళ్ళు గట్టిగా ఖండించాలి. అంతవరకూ సుబ్బారావుకి అన్యాయమే జరుగుతుంది. "మామా! నువ్వు ముసలివాడివి. నోరు మూసుకుని అవతల కూర్చుని, ఆ తాళాలు ఇలా ఇవ్వు" అని అల్లరి చెయ్యలేకకాదు. పెద్దరికాల ఎడలగల గౌరవం, విశ్వాసం, న్యాయదృష్టి సుబ్బారావుని కట్టిపడేసాయి. అంతే. ఈ మంచితనాన్ని, చేతకానితనంగా వూహించుకుంటే అట్లా ఇష్టం వచ్చినట్లు పేలితే ఆ రోజులు ఎన్నాళ్ళో సాగవు - ఆ రోజుల్లో సరిగా ఇప్పుడు సుబ్బారావున్న పరిస్థితిలో వున్నప్పుడు తనూ ఈరకంగా ఆలోచించాడు సూరిబాబు. అయితే సందర్భాన్ని బట్టి, స్థానాన్ని బట్టి సూరిబాబు ఆలోచన్లు ముసలివయ్యేయి; మార్పు తెచ్చుకున్నాయి.

కూతురు అగ్గిపెట్టె దీసుకుని లోపలికి వెళ్ళింది.

ఆ మధ్య ఒకరోజు పనిమీద బస్తీకి వెళ్ళేడు సూరిబాబు. అనుకోకుండానే ఇన్నాళ్ళ తర్వాత మరలా రత్నం కన్పించింది. రిక్షా ఆపించి దిగివచ్చి తనతో ఆప్యాయంగా మాట్లాడింది రత్నం.

వాళ్ళు ఇన్నేళ్ళూ విశాఖపట్నంలో స్థిరపడ్డారట. ఇంకా నాటకాలు ఆడ్తూనే వున్నారట. రాజయ్య నాలుగేళ్ళ క్రితం పోయాడట. అయినా ధైర్యంగా నిలబడి తనే నడుపుకు వస్తూవుందట. ఖర్చులు పెరిగి ఆదాయం సన్నగిల్లిన ఈ రోజుల్లో నాటకాల్ని నడపడం కష్టంగా వుందట. అయినా ఆ పిచ్చినీ, ఆ తృప్తినీ వొదులుకోలేకుండా వుందట.

గుంటూరు నుంచి కొందరు కళాప్రియులు రమ్మని రాసారట. అటు వెడదామని ఇరవయి రోజులపాటు అక్కడ ప్రదర్శనలుంటాయని చెప్పింది. ఆ తర్వాత బెజవాడ వయిపు వస్తారట.

"మీరు కనపడతారని అనుకుంటూనే వున్నాను, కనపడ్డారు. ఈ ప్రాంతాల్లో కొన్ని ప్రదర్శనలు మీరు ఏర్పాటు చెయ్యాలి మరి!" అని నవ్వింది, రత్నం.

"అట్లాగే." అన్నాడు సూరిబాబు, ఆపేక్షగా చూస్తూ.

రత్నం సూరిబాబుగురించి ఏన్నో వివరాలు అడిగింది. అతను బాగా చిక్కిపోయాడని అంది. అతన్ని తన మకాంకి రిక్షాలో తీసికెళ్ళి మర్యాదలు చేసింది. కాఫీ తెప్పించి ఇచ్చింది. సూరిబాబుకి ఎంతో ఆనందం కలిగింది. చాలా సేపు కబుర్లు అయేక, ఆకర్న ఒక అమ్మాయిని పిల్చి "పోల్చుకున్నారా?" అని అడిగింది, రత్నం.

"దీని పేరు ఇందిర. అన్నీ మీ పోలి కలే. మీబుద్ధులే." అని నవ్వింది.

"ఇది మన కూతురు" అని సిగ్గు పడింది

సూరిబాబూ సిగ్గుపడ్డాడు. మధుర మయిన ఆ స్మృతులు గుండెల్లో మెదిలి పులకరింతలు గలగ చేసాయి.

"మేము ఈ వూరు వచ్చాక ఉత్సాహం గల కొందరు కళాప్రియులతో మాకు పరిచయం కలిగింది. వాళ్ళంతా మాకు ఎంతో ప్రోత్సాహం ఇచ్చి కార్యక్రమాలు ఏర్పాటుచేస్తామని మాట ఇచ్చారు. ప్రోగ్రాములుంటయ్యి, అయినా మీరు లేకపోతే నాకు తృప్తిలేదు" అంది, రత్నం.

సరిగా అప్పుడు సుబ్బారావు అక్కడికి వచ్చాడు. సూరిబాబుని చూసి కంగారుపడ్డాడు. సూరిబాబు మొహం ఎర్రగా అయింది. ఇద్దరూ దొంగల్లా తత్తరపడ్డారు. దొంగని దొంగే పట్టగలడు.

"వీరు సుబ్బారావుగారని చాల సహృదయులు. మీకూ ఆ 'అభిరుచి' వుండటం వలన వీరితో ఇదివరకే పరిచయం వుండివుండాలి. సూరిబాబుగారని మాకు అప్తులు, మంచి కళాభిమానులండీ, సుబ్బారావుగారు'' అంది రత్నం, నవ్వుతూ.

సూరిబాబూ నవ్వాడు. "ఇతను నాకూ తెల్సు, రత్నం!" అన్నాడు. సుబ్బారావు ఒక నిముషం ముళ్ళమీద కూర్చున్నట్టు కూర్చుని వెళ్ళిపోయాడు. సూరిబాబు దగ్గర 'ఆ మాట' తీసుకుని గాని విడిచిపెట్టలేదు రత్నం.

అది జరిగి నెల అయింది. గుంటూరులో 'ప్రోగ్రాంలు' అన్నీ బాగా ముగించుకుని మరల తిరిగి బెజవాడ వచ్చామని, ప్రోగ్రాం గురించి మాట్లాడాలనీ సూరిబాబుని రమ్మని మనిషిని పంపింది రత్నం, రెండ్రోజులు క్రితం. వెళ్దామనుకుంటూనే వాయిదా వేస్తూ వచ్చాడు సూరిబాబు, ఎప్పటికప్పుడు.

"ఇది విన్నారా?" భార్య చేతులు తుడుచుగుంటూ వచ్చింది

"ఏమిటి?" చుట్ట అవతల విసిరేస్తూ అడిగాడు సూరిబాబు.

"రేపటికి పాతికమందికి భోజనాలు కావాలని పురమాయించి మీఅల్లుడు బస్తీ వెళ్ళాడట. ఎవర్నో తీసుకొచ్చి మనూళ్ళో రేపురాత్రికి నాటకాలు వేయిస్తాడట, సుబ్బారావు"

సూరిబాబు గతుక్కుమన్నాడు

సుబ్బారావు పిచ్చిలో పడ్డాడు. అక్కడ వున్నంతసేపూ అతని ఆ చూపులుచూసిగ్రహించాడు, తను. ఇందిర గజ్జల గుర్రంలా తిరుగుతూ సుబ్బారావుని పిచ్చెత్తేలా చెయ్యటం తను గమనించాడు. ఆ వ్యామోహంలోపడి సుబ్బారావు పిచ్చిగా ప్రవర్తిస్తున్నాడు. ఈ అక్రమాన్ని అరికట్టకపోతే గొడవలు.



పైగా, నలుగుర్లో నగుబాటు. అంతా గజిబిజిగా సాలెగూడులా వుంది!

"అల్లుడి ప్రయోజకత్వం గురించి విన్నారుగా, ఏం చేద్దాంమంటారు?" అంది భార్య, బరువంతా సూరిబాబు మీదతోస్తూ. "ఇట్లాంటివి మన ఇంటా వంటాలేదు (?) సుబ్బారావు చివరికి కిరాయి నాటకాలవాళ్ళ స్థాయికి దిగిపోయాడా? అతనికి తగిన శాస్తి నేను చేస్తానుగా. మీకెందుకు మీరు వూరుకోండి," అని వెంటనే బట్టలు మార్చుకుని, బీరువాలోంచి డబ్బు తీసుకుని బయటపడ్డాడు సూరిబాబు.

సూరిబాబు బస్సెక్కి బస్తీకి చేరుకునేసరికి సాయంత్రమయింది. మిగతా పన్లు చూసుకున్నాక రత్నాన్ని కలుసుకుని మాట్లాడేసరికి బాగా ప్రొద్దుపోయింది. తన అనుభవం ఉపయోగించి, ఎంత ప్రయత్నించినా వ్యవహారం దార్ని పడలేదు. పైగా వాళ్ళమాటలు గుండెల్ని చీలుస్తూ సూరిబాబు భ్రమల్ని తొలగించేయి. వాస్తవ స్థితిగతులు ఎదురయితే మనిషి కల్పించుకున్న కృత్రిమ వాతావరణం కరిగి నీరవుతుంది. వికృతమే అయినా పచ్చి నిజాల ఎదట అబద్ధాలు గజగజ వణుకుతాయి. అటువంటి స్థితిని

మనిషి భరించటం కష్టం. హోటలు రూంలో వుంచి, ఇతర వ్యవహారాలు చూసుకుని, మొహం వ్రేలాడవేసుకుని మర్నాడు మధ్యాహ్నానికల్లా సూరిబాబు వూళ్ళో బస్సుదిగే సరికే – వూళ్ళో హడా వుడిగా వుంది. బస్తీనుంచి 'వాను'లో తెరలు దుస్తులు వున్న మూటలు దిగాయి. పెట్రొమాక్సు లైట్లు వచ్చేయి. సుబ్బారావు స్నేహితులు నలుగురయిదు గురు నడుంకట్టి స్కూలు ప్రక్క మైదానంలో స్టేజి ఏర్పాటు చేసేరు. తెరలు కట్టిస్తున్నారు. ఊరంతా నాటకం గురించే హుషారుగా చెప్పుకుంటున్నారు.

నీరసంగా ఇంటికొచ్చి ఒంట్లో బాగా లేదనిచెప్పి పడుకున్నాడు సూరిబాబు. మంచులా గడ్డకట్టిన ఆలోచనలు. నిద్ర లేచేసరికి ప్రొద్దు వాటారింది.

సాయంసంధ్య చీకట్లకి లొంగిపోతూంది.

"ఇదిగో, మిమ్మల్నే. అందరూ నాటకానికి వెళ్తున్నారట! 'శకుంతల' నాటకం చాలా బాగా వేస్తారని అంటున్నారు. నేనూ, అమ్మాయీ వెళ్తున్నాము. మీరూ వస్తారా?" అంది భార్య, ముస్తాబు పూర్తిచేసుకునివచ్చి.

రానన్నట్టు తల అడ్డంగా వూపాడు సూరిబాబు.

తల్లీకూతుళ్ళు వెళ్ళిపోయారు. తనకీ వెళ్ళాలని మనసు పీకింది కాని తను వెళ్ళలేదు! బయట వేపచెట్టుక్రింద మంచం వేయించుకుని వడుకుని చుట్ట వెలిగించాడు సూరిబాబు. పిల్లగాలి చల్లగా వస్తూంది.

స్కూలు దగ్గరనుంచి హార్మణీ సంగీతం వినవస్తూంది. పెట్రొమాక్సు లైటు కనవడ్తూంది. అంతా వింటూ, చూస్తూ, అక్కడికి వెళ్ళాలనిగుండెల్లోంచి తన్నుకువస్తున్న కోరికని బలవంతాన అణిచిపట్టి దీర్ఘంగా నిట్టూర్చాడు సూరిబాబు.

ప్రార్థన అయింది. జనం కలకల మంటున్నారు. తెర పైకి లేచింది. మేనకా, విశ్వామిత్రులు పద్యాలు పాడుతున్నారు. ఆ గొంతు తను పోల్చుకో గలడు. మేనక గొంతు రత్నంది. రత్నం గొంతెత్తి ముగ్ధమోహనంగా పాడుతూంది. విశ్వామిత్రుణ్ణి రమ్మంటూంది.

తనకి వెళ్ళాలనుంది. అయినా, తాను వెళ్ళలేదు.

తనకి మొహం చెల్లదు.

ఆ సూరిబాబు చచ్చిపోయాడు. ఇప్పుడు మిగిలివున్న సూరిబాబు బూజు పట్టిన ఆలోచనల్తో, ముసలితనం ఆవహించిన జడత్వంతో, మకిలిపట్టిన కుచ్ఛితపు బుద్ధితో జీవచ్ఛవంగా మారాడు.




అసలు ఆ విధంగా ఎందుకు జరగాలి?

నిన్న బస్తీ వెళ్ళి తను రత్నంకి ఎంతో డబ్బు ఎరచూపాడు. "నీకు ఎంత డబ్బయినా ఇస్తాను రత్నం. నువ్వు మాత్రం చిన్న సాయం చెయ్యాలి. ఆ సుబ్బారావు మంచివాడుగాడు. అతను పరమనీచుడు. వాడ్ని దూరంగా పారతోలి నువ్వు ఈ ప్రోగ్రాం మానెయ్యి. కావాలంటే ఇతర ఊళ్ళల్లో నీకు ప్రోగ్రాంలు ఎన్నో ఏర్పాటుచేస్తా. ఎంత డబ్బయినా సరే. ఎంత నష్టంవచ్చినా సరే. నువ్వుమాత్రం నా మాటవిని, మా ఊరు రావద్దు." అని బ్రతిమాలాడు.

రత్నం తనని తీవ్రంగా చూసింది. "సూరిబాబూ! మనిషి డబ్బుని సంపాదిస్తాడు. కాని డబ్బు మనిషిని సంపాదించకూడదు. మనిషికి డబ్బే ముఖ్యం గాదు. నాకు సుబ్బారావుగారు అంతా చెప్పారు. మీ రెందుకు ఇట్లా మారిపోయారు? అంతగా భయపడి పోవల్సినంత రాక్షసిగా మీకు నేను కనపడ్తున్నానా? సర్లెండి. మనుషుల తత్త్వాలు అర్థమయినాయి. సంతోషం. ఒక మాట వినండి. కేవలం డబ్బే ముఖ్యమనుకుంటే నేను ఈనాడు ఈ అవస్థలో వుండేదాన్నిగాదు. ఏది ఏమయినా మీ ఊళ్ళో రేపు ప్రదర్శన జరిగి తీరుతుంది. నేను మాట తప్పే మనిషిని గాదు. యిప్పటి కయిందిచాలు. యిది మీలాంటి పెద్దమనుషులకి చోటుగాదు. మర్యాదగా దయచెయ్యండి" అంది రత్నం. తను తలవంచుకున్నాడు. వచ్చేసాడు.

నాటకం జోరుగా సాగుతూ వుంది. సంగీతంతో కలిసి పద్యాలు కర్ణపేయంగా వినవస్తున్నాయి. శకుంతల పుట్టి విశ్వామిత్రుడు సర్వం తెంచుకుని వెళ్ళిపోయిన సందర్భంలో రత్నం అతి దీనంగా పాడుతూంది.

ఆ పాటవచ్చి సూరిబాబు గుండెలు చీలుస్తోంది. సూరిబాబుకి అప్రయత్నంగానే కన్నీరు తిరిగింది. అలౌకికమయిన

దిగులుతో, వేదనతో, జ్వలిస్తూవున్న మనసుతో ఘర్షణకి దిగింది సూరిబాబు లౌకికదృష్టి. ఆ ప్రయత్నంలో అది విఫలమయి ఓ మెట్టు దిగి ఓటమిని ఎదుర్కొనవలసి వచ్చింది, చివరికి.

తనూ, తన నమ్మకాలూ, తన ప్రయత్నాలూ తేలిగ్గా చూడబడినప్పుడు, ఆత్మవిశ్వాసం దెబ్బతినవలసిన పరిస్థితి ఎదురయినప్పుడు మనిషి విపరీతమయిన జాలికి లోనవుతాడు. తన అహంకారానిది కిందిచెయ్యి అయినపుడు తన అస్తిత్వానికి అవమానం జరిగినప్పుడు మనిషి తీవ్రమయిన వేదనకి గురవకతప్పదు. ఆత్మసాక్షే తప్పని వేలెత్తి చూపించిన సమయాన, సమర్థించుకోచూడటం వృథా ప్రయాసగానే మిగిలిపోతుంది. విషయాన్ని సాకల్యంగా సుబ్బారావు దృష్టితోచూసి, స్వానుభవంతో రంగరించి అన్నీ బేరీజు వేసుకున్నాక ఇప్పుడు తనకి అవమానం జరిగినందుకుగాక, తనలోని సూరిబాబు చచ్చిపోయి జీవితపు చివరిదశలో తను జీవచ్ఛవంలా ప్రవర్తించినందుకు కుమిలిపోయాడు సూరిబాబు. నాటకం నడుస్తూ వుంది.

తలిదండ్రులు వదిలిన శకుంతల పెరిగి పెద్దదయింది.

యవ్వనం సంతరించుకుని లతాకుంజములమధ్య లేడికూనలతో పాటలు పాడ్తూ గంతులు వేస్తూంది 'ఇందిర'. రక్తసంబంధాన్ని మరిచి ఇందిరని తను గజ్జలగుర్రమని అన్నాడు ! దుష్యంతుని రంగ ప్రవేశం అయింది.

ముగ్ధమోహనంగా పాడ్తున్న ఆ గొంతుని సూరిబాబు పోల్చుకున్నాడు. సుబ్బారావు అద్భుతంగా పాడ్తూ రాజఠీవిని కంఠంలో ఒలికిస్తున్నాడు !

మాసిపోయిన లాల్చీ, పైజమాలతో రేగిన జుట్టుతో ఘర్షణపడి నగుబాటు పాలయిన సుబ్బారావు తలపుకివచ్చి జాలిగా నిట్టూర్చాడు సూరిబాబు.

ఇక ఆగలేక, మంచంమీంచి లేచి, పైపంచ భుజాన వేసుకుని, ఇల్లు అట్లాగే వొదిలి స్కూలువయిపు సాగిపోయాడు సూరిబాబు, కాసేపయినా జీవితాన్ని మరిచి, నాటకాన్ని ఆనందిద్దామని. జీవితం అర్థంకానప్పుడు అది భ్రమ అని తెల్సినా, నాటకంకోసం మనిషి అర్రులు చాచక తప్పదు. అది గ్రహించిన సూరిబాబు అక్కడికి వెళ్ళేసరికి అంకం ముగిసి రంగంమీద తెర దిగింది.

